క్లుప్తంగా

దివ్యాంగునికి ఆర్థిక సాయం

మార్కాపురం: తర్లుపాడు మండలం చెన్నారెడ్డి పల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన ఏకాశి రాముడికి మార్కాపురం పట్టణంలోని సాయి బాలాజీ స్కూల్ విద్యార్థులు రూ.8600 ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందించారు. ఏకాశి రామునికి రెండు చేతులు, కాళ్లు లేకపోయినా తన ప్రతిభతో డ్యాన్సులు, మిమిక్రీ చేస్తూ విద్యార్థులను అలరించాడు. అనంతరం విద్యార్థులు సేకరించిన నగదును కరస్పాండెంట్ ప్రకాష్‌రావు చేతులమీదుగా అందజేశారు.

స్పందన స్కూల్‌కు ఎక్స్‌లెన్స్ బెస్ట్ అవార్డు



బెస్ట్ స్కూల్ అవార్డు తీసుకుంటున్న పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి

రాచర్ల: బ్రెయిన్ ఫీడ్ సంస్థ దేశ వ్యాప్తంగా ఉన్న స్కూల్స్‌లో అత్యుత్తమ విద్య అందిస్తూ విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తున్న యాజమాన్యాలకు అందించే ప్రతిష్టాత్మక స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు మండల కేంద్రం రాచర్లలోని స్పందన స్కూల్‌కు వచ్చింది. ఈ వార్డును హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్పందన స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్, హ్యాండ్ రైటింగ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్పోర్ట్స్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు అన్ని రంగాల్లో ముందుంచుతున్నందుకే ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డు వచ్చిందని చెప్పారు.

జీఎంఆర్ స్కూల్‌కు కూడా..

మార్కాపురం: మార్కాపురంలోని జీఎంఆర్ స్కూల్‌కు హైదరాబాద్‌లోని బ్రెయిన్‌ఫీడ్ సంస్థ ప్రతిష్టాత్మక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును అందించినట్లు కరస్పాండెంట్ జి.మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తాను అవార్డు అందుకున్నట్లు తెలిపారు. మల్లికార్జునరెడ్డిని పలువురు అభినందించారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు (కంభం): మండలంలో ఖాళీగా ఉన్న రెండు గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దొనకొండ సచివాలయం పరిధిలోని వీరభద్రాపురంలో బీసీ జనరల్-1, పెద్ద కందుకూరు సచివాలయం పరిధిలో ఎస్టీ జనరల్-1, ఖాళీలు ఉన్నాయని, ఈ నెల 16 నుంచి 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉజ్వల యోజనతో ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు

బేస్తవారిపేట: దారిద్య్రరేఖకు దిగువనున్న మహిళలకు ఉచిత ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో, నేకునాంబాద్ సచివాలయ ఆవరణలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. బ్యాంకుల నుంచి పీఎం ముద్ర రుణాలు, సుకన్య సమృద్ధి యోజనలో బాలికలకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ, వైద్యశాఖ, బ్యాంక్‌ల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, ఈఓపీఆర్డీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

యర్రగొండపాలెం: ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఎన్నికల టీడీ శ్రీనివాసులు, ఎంఈవో పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి మహాయజ్ఞం

దర్శి: లోక కళ్యాణార్థం స్థానిక శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. హరిద్వార్ స్వాముల ఆధ్వర్యంలో 24 కుండీల గాయత్రిదేవి మహాయజ్ఞం చేశారు. ముందుగా మహిళలు కుండీలతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులకు ఉపయోగం

కొమరోలు: వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులకు ఎంతగానో దోహద పడుతుందని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలు ప్రదర్శించగా ఆ ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు.

పొట్టిశ్రీరాములు మహోన్నత వ్యక్తి


పటేల్, పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ, మున్సిపల్ చైర్మన్


పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ముండ్లమూరు: పొట్టి శ్రీరాములు మహోన్నత వ్యక్తి అని, రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన ఘనుడు అని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. మండల కేంద్రంలో అమరజీవి పొట్టిశ్రీరాములు బస్‌షెల్టరు ఆవిష్కరణకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్య వైశ్యులకు ఉన్న ధైర్యం, గొప్పతనం గొప్పదన్నారు. ఇందుకు మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు, రోశయ్యలు నిదర్శనమన్నారు. ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. అటువంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఎన్నికలు రాబోతున్నాయని, అందరూ బాధ్యతగా, పద్ధతిగా ముందుకు సాగాలని చెప్పారు.

జాతీయ నేతలకు మంత్రి సురేష్ నివాళి

యర్రగొండపాలెం: భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం తాడేపల్లిలోని తన నివాస గృహంలో వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మహానాయకుల త్యాగాలను మంత్రి సురేష్ కొనియాడారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం కమిటీ, ఆర్యవైశ్య సంఘం శుక్రవారం ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ నిర్వాహకులు సత్యనారాయణ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ఎప్పటికి చిరస్మరణీయులే అని అన్నారు. ఆయన్ను స్మరించుకోవడం మన అదృష్టంగా భావించాలన్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు చెంచయ్య, బాలవెంకటేశ్వర్లు, రాములు, అనంతరంగయ్య, గర్రె వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు

మార్కాపురం టౌన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొశ్నెట్టి జగన్‌బాబు, హెచ్‌ఎం ఎం.సుధాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, భాస్కర్, ఆర్యవైశ్య సంఘ నాయకులు జనార్దన్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నియామకం

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ విభాగాల కమిటీలకు వివిధ హోదాల్లో నియామకం జరిగింది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిపినట్లు కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దర్శి నియోజకవర్గంలోని పలువురికి ఈ అనుబంధ కమిటీల్లో స్థానం దక్కింది. బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా కుంచాల పెద్ద నాగరాజు, కార్యదర్శులుగా కండె గంగయ్య, బరిగల శ్రీను, జాయింట్ సెక్రటరీలుగా అన్నవరపు రవి, చేకూరి జగన్‌లను నియమించారు. జిల్లా మహిళా విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా వజ్జా నాగమణి, సెక్రటరీలుగా మేడిశెట్టి నాగమణి, ఇంటూరి పద్మ, జాయింట్ సెక్రటరీలుగా కందిమళ్ల గీతాంజలి, పసుపులేటి వెంకాయమ్మలను నియమించారు. జిల్లా మైనార్టీ సెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా షేక్ అమీన్ బాషా, సెక్రటరీలుగా షేక్ బాజీ, షేక్ నాయబ్‌రసూల్, జాయింట్ సెక్రటరీలుగా షేక్ లాలు సాహెబ్, షేక్ కరిముల్లాను నియమించారు. జిల్లా పంచాయతీరాజ్ వింగ్ కమిటీలో వైస్ ప్రెసిడెంటుగా వరికూటి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా మొదుళ్ల వెంకట సుబ్బారెడ్డి, సెక్రటరీగా భద్రి వెంకట సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా మాదిరెడ్డి రామకృష్ణారెడ్డి, పోలెబోయిన పెద్ద పెద్దయ్యలను నియమించారు. జిల్లా పబ్లిసిటీ వింగ్ కమిటీలో జనరల్ సెక్రటరీగా కోరె చిన్న సుబ్బారావు, సెక్రటరీలుగా దామర్ల చంద్రమౌళి, బొమ్మినేని అంకబాబు, జాయింట్ సెక్రటరీలుగా మూడమంచు చిన్న యల్లయ్య, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు. జిల్లా ఎస్సీ సెల్ కమిటీలో ప్రెసిడెంటుగా గాలిమూటి దేవప్రసాద్, జనరల్ సెక్రటరీగా గుంటు పోలయ్య, సెక్రటరీలుగా కుంట అచ్చారావు, చిల్లా సుశీల ప్రతాప్, జాయింట్ సెక్రటరీలుగా కొడవటి జాన్, గోల్లపాటి అచ్చయ్యలను నియమించారు. జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీలో జనరల్ సెక్రటరీగా జోసఫ్, సెక్రటరీలుగా కొరివి చిన్న కోటేశ్వరరావు, పి.యలమందారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా మొదుళ్ల శ్రీనివాసరెడ్డి, కొర్రపాటి విష్ణులను నియమించారు. జిల్లా వాణిజ్య విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా సానికొమ్ము తిరుపతిరెడ్డి, సెక్రటరీలుగా తెలగంశెట్టి చంద్రశేఖర్, తెల్ల ఇంద్రసేనారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా బొమ్మనబోయిన చిన్న వెంకయ్య, ధర్మ వాసుదేవరెడ్డిలను నియమించారు. జిల్లా వికలాంగుల విభాగం కమిటీలో వైస్ ప్రెసిడెంటుగా దగ్గుల బ్రహ్మానందరెడ్డి, జనరల్ సెక్రటరీగా మురికిపుడి వెంకటయ్య, సెక్రటరీలుగా వెన్నపూస సుబ్బారెడ్డి, బెజవాడ కరుణాకర్, జాయింట్ సెక్రటరీలుగా నూనె ప్రసన్న, రెడ్డిమాసు శ్రీరామమూర్తిలను నియమించారు. జిల్లా వీవర్స్ వింగ్ కమిటీలో సెక్రటరీలుగా పులిపాటి శింగరకొండ, అనుముల వెంకటేశ్వర్లు, దొంతు వెంకటేశ్వర్లును నియమించారు. జిల్లా యూత్ వింగ్ కమిటీలో ప్రెసిడెంట్‌గా గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా భీమిరెడ్డి నాగ మల్లేశ్వరరెడ్డి, సెక్రటరీలుగా గర్నెపూడి ప్రసన్నకుమార్, నలదిమ్ము యోగిరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ గఫార్, గుంటు అజయ్‌కుమార్‌లను నియమించినట్లు కేంద్ర కార్యాలయం జాబితా విడుదల చేసింది.

మార్కాపురం నియోజకవర్గ నాయకులకు వైఎస్సార్ సీపీలో కీలక పదవులు


మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగ కమిటీలో మార్కాపురం నియోజకవర్గానికి చెందిన పలువురికి కీలక పదవులు లభించాయి. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది.

- జిల్లా బీసీ సెల్ విభాగం జనరల్ సెక్రటరీలుగా నల్లబోతుల కొండయ్య, వి.సాయిరాజేశ్వరరావు, కార్యదర్శులుగా పిన్నిక లక్ష్మీ ప్రసాద్‌యాదవ్, చాతరాజుపల్లి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా గుమ్మా రాజేంద్రప్రసాద్‌ను నియమించారు.
- జిల్లా మహిళా విభాగంలో జనరల్ సెక్రటరీగా జి.రోజ్‌లిడియమ్మ, కార్యదర్శులుగా కంది ప్రమీలారెడ్డి, పేరం వెంకటలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా అన్నెం సుబ్బమ్మ, వేమన గోవిందమ్మ, షేక్ గౌసియాలు నియమితులయ్యారు.
- జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీగా షేక్ కరీం బాషా, సెక్రటరీగా షేక్ ఖలేఖాన్, షేక్ రహమ్‌తుల్లా, జాయింట్ సెక్రటరీగా మీర్జా బర్కత్ ఆలీబేగ్, ముల్లా జకీర్‌హుస్సేన్, షేక్ అక్బర్ ఆలీ నియమితులయ్యారు.
- జిల్లా పంచాయితీరాజ్ వింగ్‌లో జనరల్ సెక్రటరీగా కల్లం సుబ్బారెడ్డి, సెక్రటరీలుగా పోరెడ్డి చెంచిరెడ్డి, గాయం వెంకటేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీగా తాతిరెడ్డి చలమారెడ్డి, వేమా సుబ్బారెడ్డిని నియమించారు.
- జిల్లా పబ్లిసిటీ వింగ్‌లో జనరల్ సెక్రటరీగా ఉలవా గోపి, సెక్రటరీలుగా రఘుపతి శివప్రసాద్, జంకె మోహన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా గొలమారి చెన్నారెడ్డిని నియమించారు.
- జిల్లా ఎస్సీ సెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా జాన్‌రత్నం, సెక్రటరీలుగా కవలకుంట్ల నరసింహారావు, గూడూరి స్వప్న, జాయింట్ సెక్రటరీలుగా పల్లెపాటి కాంతారావు, చిరుగూరి కోటేశ్వరరావు, జమ్మళమూడి ఇజ్రాయిల్ నియమితులయ్యారు.
- జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీగా మేకల వెలుగొండారెడ్డి, సెక్రటరీలుగా పందీటి రవీంద్రబాబు, ఏలూరి సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా నూనె వెంకటేశ్వరరెడ్డి, చెన్నూరి శ్రీనివాసులు నియమితులయ్యారు.
- జిల్లా వాణిజ్య విభాగం కమిటీ అధ్యక్షుడిగా తడికమళ్ల బాలసుబ్బారావు, జనరల్ సెక్రటరీగా బుశ్శెట్టి నాగేశ్వరరావు, సెక్రటరీలుగా మొగుళ్లూరి మల్లికార్జునశెట్టి, పోలేపల్లి జనార్దనరావు, జాయింట్ సెక్రటరీలుగా బచ్చు జనార్దనరావు, కె.రమేష్ నియమితులయ్యారు.
- జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా నడికట్టు వెంకటరమణారెడ్డి, సెక్రటరీలుగా ఎస్.బాలచంద్రుడు, ఎల్.శేఖర్, జాయింట్ సెక్రటరీలుగా ఎం.ఆంజనేయులు, బి.వెంకట నరసింహారావు, బైరెడ్డి వెంకటరెడ్డి నియమితులయ్యారు.
- జిల్లా వీవర్స్ వింగ్ కమిటీ సెక్రటరీలుగా చెన్న రంగనాయకులు, బండి నరేంద్ర, జి.సోమయ్య నియమితులయ్యారు.
- జిల్లా యూత్ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీగా గొలమారి శివారెడ్డి, సెక్రటరీలుగా దాసరి వెంకటేశ్వర్లు, కె.రామాంజనేయరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కె.శేషిరెడ్డి, షేక్ రబ్బానీ నియమితులైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల నియామకం

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో పలువురిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా బీసీ సెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా పల్లెబోయిన వెంకటరాజు, సెక్రటరీలుగా పిక్కిలి వెంకట రమణ, పి. బాల చిన్నయ్య, గుర్రం శ్రీరాములు, టి.బ్రహ్మయ్య, జిల్లా మహిళా విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా నల్లబోతుల నాగమల్లేశ్వరి, సెక్రటరీలుగా షేక్ ధనియాల ఖాశింబీ, రెడ్డిచర్ల ఉమాదేవి, జిల్లా మైనార్టీ సెల్ కమిటీలో జనరల్ సెక్రటరీగా సయ్యద్ జావీద్, సెక్రటరీలుగా షేక్ ఖాదర్, షేక్ షఫూల్ రెహమాన్, జాయంట్ సెక్రటరీలుగా షేక్ కరిముల్లా, మహబూబ్ పీరా, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ కమిటీలో వైస్ దుగ్గా రంగస్వామిరెడ్డి, జనరల్ సెక్రటరీగా లక్కవరపు శ్రీనివాసులు, సెక్రటరీగా మల్లెల చంద్రశేఖరరెడ్డి, జాయంట్ సెక్రటరీలుగా గుంటూరి డేవిడ్, శ్రీగిరి రంగనాయకులు, జిల్లా పబ్లిసిటీ వింగ్ కమిటీలో జనరల్ సెక్రటరీగా గుంటూరి డేవిడ్, జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీలో జనరల్ సెక్రటరీగా మొగిలిపాలెం కాశీవిశ్వనాథ్, సెక్రటరీలుగా గొడ్డేటి బాలకృష్ణ, దుగ్గిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయంట్ సెక్రటరీలుగా ఏసుపోగు మధు, సతీష్‌కుమార్‌రెడ్డి, జిల్లా వికలాంగుల విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా సవరం తిరుమల సుధాకర్, సెక్రటరీగా రావులకొల్లు కాశీశ్వరయ్య, జిల్లా వీవర్స్ (చేనేత) విభాగం కమిటీలో సెక్రటరీలుగా దోమల రాముడు, బోడివర్ల భాస్కరరావు, బొంగరి శ్రీరాములు, గద్దె లీలాసాయి, జిల్లా యూత్ వింగ్ కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా సోమిశెట్టి సుబ్బరాయుడు, జనరల్ సెక్రటరీగా గోడి వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీగా షేక్ ఆరీఫ్, బండి తిరుమలనాథ్, జాయింట్ సెక్రటరీగా అవ్వారి గురుమూర్తి, బొమ్మని నాగమల్లేశ్వరరెడ్డిలను నియమించారు.

ప్రపంచ బాలల తెలుగు ఉత్సవాల్లో ప్రతిభ


లాస్యను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

మార్కాపురం టౌన్: ఇటీవల గుంటూరులో జరిగిన ప్రపంచ బాలల తెలుగు ఉత్సవాల్లో మార్కాపురం పట్టణంలోని సాయిబాలాజీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ పి.ప్రకాశరావు, ప్రిన్సిపాల్ డి.మస్తాన్‌వలి తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 1500 మంది విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాలకు చెందిన ఎం.లాస్యప్రియ ఏకపాత్రాభినయం, తెలుగులో మాట్లాడుదాం పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. భరతనాట్యం పోటీల్లో కె.చైతన్య తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు.

వైకల్యం విద్యాభివృద్ధికి అడ్డురాదు

కొనకనమిట్ల: అంగవైకల్యం విద్యాభివృద్ధికి అడ్డు కాదు అని ఎంఈఓ బరిగె నరసింహారావు, ఐఈడబ్బు రిసోర్స్ పర్సన్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు, హియరింగ్ మిషన్లు శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. పదిహేనేళ్లలోపు దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగులను కించపరచకుండా ప్రోత్సహించాలన్నారు. చినారికట్ల జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం కోటిరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

రేపు గ్రూపు-2పై అవగాహన సదస్సు

దర్శి: గ్రూపు-2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నెల 17 ఆదివారం ఒంగోలులోని ఆంజయ్య రోడ్డు కాపు కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వెంకటరెడ్డి తెలిపారు. డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి. వెంకటరెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ డీవైఎఫ్ఐ ధాత్రి అకాడమి సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరవుతారని చెప్పారు. ఉద్యోగం సాధించటం ఎలా? సక్సెస్ కావడంపై చాప్టర్ వైజ్ ఎగ్జామ్స్, వీక్లీ ఎగ్జామ్స్, గ్రాండ్ టెస్టులు ఎనాలసిస్ గురించి వివరిస్తారని చెప్పారు. అవగాహన సదస్సుకు హాజరైన వారికి ఉచితంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల సామాజిక, ఆర్థిక చరిత్ర స్టడీమెటీరియల్ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. డీవైఎఫ్ఐ నాయకులు ఆర్‌జేసీ పాల్, రైతు నాయకులు సందు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 97056 20277, 94903 00365, 99493 34733 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో వ్యాచరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆచార్య దేవోభవ కార్యక్రమంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, సత్యసాయి ట్రస్టు కో ఆర్డినేటర్ కొట్టె బిక్షం మాట్లాడుతూ.. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందున చక్కగా చదువుకుని ప్రయోకులుగా రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు సభ్యులు ఈర్ల బాలవెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి చీతిరాల శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 11వ సచివాలయం 19వ వార్డులో నిర్వహించిన వై ఏపీనీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 5390 మందికి 43.81 కోట్ల రూపాయలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, డీఈ సుభానీ, కౌన్సిలర్లు రంగలక్ష్మి, దొడ్డా భాగ్యలక్ష్మి, కరీముల్లా, నాయకులు జేసీఎస్ కన్వీనర్ రవిచంద్ర, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరించి, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డ్వాక్రా బజారులో నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఎమ్ఈఓలతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద క్రీడా టోర్నమెంట్‌ను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, కాంపిటీషన్ విభాగంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు. గ్రామ, వార్డు, సచివాలయాల స్థాయిలో ఈనెల 20వ తేదీ వరకు, మండల స్థాయిలో ఈనెల 21 నుంచి జనవరి 4వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో 5వ తేదీ నుంచి 10వవరకూ, జిల్లా స్థాయిలో జనవరి 11 నుంచి 21 వరకు, రాష్ట్ర స్థాయిలో 22 నుంచి 26వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల వేళ ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించనున్నందున ఇప్పటి నుంచే సందడి వాతావరణం నెలకొందని, యువత ఉత్సాహంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రౌండ్లు సిద్ధం చేసి, రిఫరీలను నియమించాలని చెప్పారు. క్రీడా సంబరాలతో గ్రామాల్లో ఐక్యతా వాతావరణాన్ని నెలకొల్పుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీపీలు అరుణా చెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, ఎంపీడీఓలు చందన, నరసింహులు, కమిషనర్ గిరికుమార్, డానియేల్, ఎంఈఓలు రాందాస్‌నాయక్, శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయండి

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కేపీ దిశానిర్దేశం


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలాగా పనిచేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం మార్కాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం, నికరంపల్లి, కోలభీమునిపాడు, తిప్పాయిపాలెం చింతగుంట్ల, వేములకోట, గొట్టిపడియ, మాల్యవంతునిపాడు, కొండేపల్లి, రామచంద్రాపురం, భూపతిపల్లె, గోగులదిన్నె, రాయవరం, గజ్జలకొండ, తూర్పుపల్లి, పెద్దయాచవరం, బోడపాడు, ఇడుపూరు, నాయుడుపల్లి గ్రామాల బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు విశ్రమించకుండా ప్రతి ఇంటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించాలని సూచించారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి, రాయవరం వద్ద మెడికల్ కళాశాల, జిల్లా వైద్యశాల అభివృద్ధి, మార్కాపురం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల మంజూరు, టీటీడీ కళ్యాణ మండపం తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

దర్శి: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే విజయం సాధ్యమని మండల విద్యాశాఖాధికారి-2 బి.రమాదేవి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎంఈఓ-1 రఘురామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా ఎంపీపీ సుధారాణి, సంఘ సేవకుడు జీవీ రత్నం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాలేషావలిలు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగులను చిన్న చూపు చూడకూడదని, వారిని ఆదరించాలని ప్రేమ్‌కుమార్, రాచపూడి మోషే అన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన దివ్యాంగుల గురించి జీవీ రత్నం వివరించారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు, స్వీట్లు ఏర్పాటు చేశారు. రిసోర్స్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసులు, బి.లీలావతి పాల్గొన్నారు.

పీసీఎల్ ప్రకాశం క్రికెట్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ

దర్శి: నియోజకవర్గం పరిధిలో ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రకాశం క్రికెట్ లీగ్ బై మాగుంట టి-10 క్రికెట్ టోర్నమెంటు బ్రోచర్‌ను జిల్లా సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో టోర్నమెంటు ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్ రూ.5 వేలు, బెస్ట్ బౌలర్ రూ.5 వేలు, బెస్ట్ ఫీల్డర్ రూ.5 వేలు, మ్యాన్ ఆఫ్‌ద సిరీస్ రూ.5 వేలు చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్‌లు వీసీ రెడ్డి, మేడం మోహనరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పులి బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మెంబర్ ఆర్గనైజర్ వెంకటాద్రిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు స్వాధీనం

కురిచేడు: అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనలతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నష్టపోకూడదని భావించి ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసింది. దర్శి నియోజకవర్గంలోని 334 కేంద్రాలను కలెక్టరు ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, ఏపీఎంలు ఆధ్వర్యంలో కేంద్రాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఉన్న స్టాకును నమోదు చేసి లబ్ధిదారులకు నిత్యంపౌష్టికాహారం అందేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. విలేజ్ పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సెంటర్లను కేటాయించి అధికారుల పర్యవేక్షణలో వారికి పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. కొందరు అంగన్‌వాడీ కేంద్రాల వారు స్వచ్ఛందంగా వచ్చి తాళాలు తీయగా కొందరు తాళాలు తీయక పోవటంతో వీఆర్వో, విలేజ్ పోలీస్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో పాటు ఆ ప్రాంత ప్రజల సమక్షంలో పంచనామా నిర్వహించి తాళాలు పగలగొట్టి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

దొనకొండ: మండలంలోని మల్లంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున వైఎస్సార్ సీపీ నాయకుడు కాలూరి రమణయ్య స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మనాభరావు, ఉపాధ్యాయులు, నాయకులు కోట్ల ఫిలిప్, పోలు అంజయ్య, విల్సన్ బాబు పాల్గొన్నారు.

అదనపు పూజారి నియామకం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి దేవస్థానంలో అదనంగా పూజారిని శుక్రవారం నియమించారు. అనంతరం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్, ఈఓలు అర్చన, అష్టోత్తరం, సహస్రనామ పూజలు ప్రారంభించారు. యథావిధిగా పూజలు దర్శనాలు, పూజలు మునుపటి లాగానే జరుగుతాయని వారు తెలిపారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న సెబ్ పోలీసులు

కురిచేడు: గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్న ట్రాక్టర్‌ను దర్శి సెబ్ సీఐ బి.సుందరరామయ్య తన సిబ్బందితో పట్టుకున్నారు. పల్నాడు జిల్లా ఐనవోలు గ్రామానికి చెందిన కొందరు ఇసుకను అక్రమంగా తమ ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ సుందరరామయ్య కాపుగాసి ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్‌కు 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు చెప్పారు. ఇంకోసారి ఇదేవిధంగా పట్టుబడితే సీజ్ చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చర్లోపల్లె సమీపంలోని గుమ్ముళ్లపల్లె క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగింది. గుంటూరు నుంచి గిద్దలూరు వైపునకు వస్తున్న రెండు కార్లను, గిద్దలూరు నుంచి గుంటూరు వెళ్తున్న మినీ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి ఆ పక్కనే ఉన్న పెద్ద చెట్టునూ ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రెండు కార్లు బోల్తా పడ్డాయి. రెండు కార్లకూ ఎయిర్ బెలున్స్ ఓపెన్ కావడంతో ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ జి.కృష్ణపావని తెలిపారు.

242 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తపల్లెలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 242 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సదర్భంగా డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి కావాల్సిన మందులు ఉచితంగా అందజేశారు.